పేదల చదువులకు అవస్థలు

నియోజకవర్గంలో 66 ప్రభుత్వ విద్యాసంస్థలు

మధ్యాహ్న భోజనం నాణ్యతపై విమర్శలు

రెండు మాసాలు దాటినా ఇంకా పూర్తి కాని పుస్తకాల పంపిణీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. గత విద్యా సంవత్సరం వరకూ అత్యంత వైభవోపేతంగా కొనసాగిన పాఠశాలలు నేడు గందరగోళంగా తయారయ్యాయని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాలలు ప్రారంభం కాగానే జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి పథకాలు అమలయ్యేవి. జగనన్న గోరుముద్ద పేరుతో చక్కని పౌష్టికాహారాన్ని అందించేవారు. వారంలో ఏ విధమైన ఆహారాన్ని అందించాలనే అంశాలను చాలా స్పష్టంగా అమలు జరిగేవి. నేడు ఆ పరిస్థితులు, పర్యవేక్షణ లేదని విద్యార్థులు వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థులకు సంబంధించిన ప్రభుత్వ పథకాల అమలులో అలసత్వం ప్రదర్శించటంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు.

పట్టించుకునే వారు కరువయ్యారు..

విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో సుమారుగా 143 విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. వీటిల్లో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, మున్సిపల్ విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. వాటిల్లో సుమారుగా 40 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రధానంగా అందులో సుమారుగా 66 ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపల్ విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. వాటిల్లో సుమారుగా 15 వేల మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరందరికీ ప్రభుత్వం అందించే పథకాలన్నీ అమలవుతున్నాయి. అయితే వాటిపై సరైన పర్యవేక్షణ లేకపోవటంతో విద్యార్థులకు వాటి అమలులో అవరోధాలు ఎదురవుతున్నాయి. వీటిపై గతంలో సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కారం చూపే దిశగా చర్యలు ఉండేవి. ఇప్పుడు వాటిని పట్టించుకునే వారు కరువయ్యారు.



పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని స్వీకరిస్తున్న విద్యార్థులు(ఫైల్)

అరకొరగా మధ్యాహ్న భోజనం

మధ్యాహ్న భోజనానికి సంబంధించి వారం రోజులూ ఏఏ ఆహార పదార్థాలను అందించాలనే అంశాలను నిర్దిష్టంగా వివరిస్తూ ఆదేశాలు ఉన్నాయి. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అటువంటి ఆదేశాలను పూర్తిగా పెడచెవిన పెడుతున్నారు. ఇటువంటి అంశాలపై ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉండాలన్నది గత ప్రభుత్వ నిర్ణయం. దానిని చాలా మంది వ్యతిరేకించారు. అయినా పిల్లలకు అందించే ఆహారంపై అలసత్వం కూడదని జగనన్న ప్రభుత్వం ఉపాధ్యాయులను పరిశీలన చేయాలని కచ్చితంగా సూచించింది. అయితే నేడు ఆ విధమైన పర్యవేక్షణ కొరవడటంతో మధ్యాహ్న భోజనానికి సంబంధించి మెనూ పూర్తిగా పాటించటం లేదని పలువురు విద్యార్థి సంఘాల నేతలు చెబుతున్నారు. అలాగే పాఠశాలలు తెరిచిన కొద్ది రోజులు కోడిగుడ్డును అందించలేదు. అంతేకాకుండా విద్యార్థులకు అందించే ఇతర ఆహార పదార్థాల్లోనూ కోత విధించారని విద్యార్థులు చెబుతున్నారు.

వెంటాడుతున్న ఉపాధ్యాయుల కొరత

పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల కొరత వెంటాడుతున్నది. సుమారు 50 నుంచి 60 మంది ఉపాధ్యాయుల కొరత ఈ నియోజకవర్గ పరిధిలోని వివిధ విద్యాసంస్థల్లో ఉంది. ప్రభుత్వ, మున్సిపల్ విద్యాసంస్థల్లో ఈ విధమైన కొరత ఉంటే ఎయిడెడ్ విద్యాసంస్థల్లో యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా ఉపాధ్యాయుల కొరత వెంటాడుతుందని ఉపాధ్యాయ సంఘాలకు చెందిన నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. దీనివల్ల విద్యార్థులకు సరైన బోధనను అందించే పరిస్థితులు లేకుండా పోయాయని విద్యార్థి సంఘాల నేతలు చెబుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి..



జిల్లాలో ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలు పరిష్కరించాలి. ప్రభుత్వం మారి కొత్త పాలకులు అధికారాన్ని చేపట్టి రెండు మాసాలవుతుంది. అయినా ఇంకా పాఠశాలల సమస్యలపై దృష్టి పెట్టలేదు. విద్యాసంస్థల్లో టీచర్ల కొరత ఉందని తెలుస్తోంది. ఖాళీల భర్తీకి తక్షణం అధికారులు చర్యలు చేపట్టాలి. ఇంకా చాలా మందికి పుస్తకాలు, బ్యాగులు అందించాల్సి ఉంది. ఆ సమస్యలను సైతం పరిష్కరించాలి.

– సోమేశ్వరరావు,
జిల్లా అధ్యక్షుడు, ఎస్ఎఫ్ఐ

క్లుప్తంగా

ఆప్తమిత్రుల పేరిట అన్నదానం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిన్నతనం నుంచి తమతో చదువుకుని భువి నుంచి దివికేగిన మిత్రుల జ్ఞాపకార్థం స్నేహితులందరూ అన్నదానం నిర్వహించారు. శ్రీతేలప్రోలు రాజా హైస్కూల్ 1989–1994 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కేటీ రోడ్డులోని స్కూల్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. తొలుత స్కూల్ ఆవరణ వద్ద ఆప్తమిత్రుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేసి తమ చిన్న నాటి స్నేహితులను గుర్తు చేసుకున్నారు. స్కూల్ ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు హనుమంతరావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 250 మంది పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు వాసి శ్రీనివాసు, రాధాకృష్ణ, రమేష్, కొండలరావు, మంగా ప్రసాద్, సంతప్, సుధాకర్, సురేష్, నందేవ్, శంకర్, సుభానిలు పర్యవేక్షించారు.

వెంకట కృష్ణారావు సేవలు అమోఘం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ పార్లమెంట్ సభ్యుడు, మాజీ మంత్రి దివంగత మండలి వెంకట కృష్ణారావు సమాజానికి అందించిన సేవలు అమోఘమని మండలి వెంకటకృష్ణారావు సామాజిక వికాస కేంద్రం అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు అన్నారు. వెంకట కృష్ణారావు 99వ జయంతి కార్యక్రమాన్ని కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ.. ప్రముఖ గాంధేయ వాది, ప్రపంచ తెలుగు మహాసభల ఆరాధ్యుడు, దివిసీమ గాంధీగా కొనియాడబడిన మండలి వెంకటకృష్ణారావు ఆదర్శనీయుడన్నారు. దివిసీమ ఉప్పెన సమయంలో మండలి చేసిన సేవా కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా కొనియాడ పడ్డాయని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పేదలకు, మార్కెట్‌లోని ప్రజలకు పండ్లను పంపిణీ చేశారు. ప్రముఖ న్యాయవాది కండెల వరప్రసాద్, వికాస కేంద్రం సభ్యులు పారా రాజు, గాలి గురవయ్య, కలుకూరి రాజు, కిరికిటి కొండ, తడిక మల్ల వెంకటేశ్వరరావు, పైడిపల్లి బాబు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉన్నత స్థానం కల్పించాలి

విజయవాడ కల్చరల్: దివ్యాంగులకు సమాజంలో ఉన్నత స్థానం కల్పించాలని అభినేత్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కామినేని ఉమాశంకర్ అన్నారు. అభినేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదిక మీద అంధ కళాకారుల సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఉమాశంకర్ మాట్లాడుతూ దివ్యాంగులు చాలా సందర్భాలలో వివక్షకు గురి అవుతున్నారని తెలిపారు. కానీ వారి ప్రతిభను అడ్డుకోలేకపోతున్నట్లు గుర్తు చేశారు. కళాపోషకుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ కళాకారులకు హద్దులు లేవన్నారు. దివ్యాంగులు కూడా సమాజంలో భాగస్వాములేనన్నారు. సాంస్కృతిక రంగ ప్రతినిధులు, ప్రసూనా రామన్, సంగీత విద్వాంసులు కేవీ బ్రహ్మానందం, స్వాతి తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులు పలు తెలుగు చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను, నిర్వాహకుడు ఉమాశంర్‌ను ఆత్మీయంగా సత్కరించారు.

అన్న క్యాంటీన్ పనులు సత్వరమే పూర్తి చేయండి



పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ పనులు సత్వరమే పూర్తి చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన పటమట, కృష్ణలంకలోని అన్న క్యాంటీన్లను పరిశీలించారు. అనంతరం ఆయన పటమట చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం సందర్శించి స్టేడియంలో వీఎంసీ కల్పించిన సదుపాయాలపై ఆరా తీశారు. స్టేడియం జరుగుతున్న మరమ్మతులను త్వరగా పూర్తిచేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన కృష్ణలంక అమరజీవి పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల బయట గ్రీనరీ పెంచాలని, పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా చేయాలని చెప్పారు. సర్కిల్–3 జోనల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, డెప్యూటీ సిటీ ప్లానర్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట సీఐ గణేష్ రిలీవ్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న తిప్పా గణేష్ ఆదివారం రిలీవ్ అయ్యారు. ఇటీవల విజయవాడ కమిషనరేట్ పరిధిలోని పలువురు సీఐలకు బదిలీలు జరిగాయి. ఈ బదిలీల్లో భాగంగా తిప్పా గణేష్‌ను ఏలూరు రేంజ్‌కు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం తన విధుల నుంచి రిలీవ్ కాగా భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు ఇన్‌చార్జి సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రక్తనాళాల వ్యాధులపై అవగాహన అవసరం

నగరంలో వాస్క్యులర్ వాక్‌థాన్

లబ్బీపేట(విజయవాడతూర్పు): మారుతున్న జీవనశైలి కారణంగా రక్తనాళాల వ్యాధులు పెరుగుతున్నాయని, వాటిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని పలువురు వాస్క్యులర్ సర్జన్స్ అన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పకుండా వ్యాయామం, నడక, యోగా వంటి వాటితో వ్యాధుల బారిన పడకుండా చూడవచ్చునని వారు పేర్కొన్నారు. ఈ నెల 6 జాతీయ వాస్క్యులర్ డేను పురస్కరించుకుని వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీశాఖ ఆధ్వర్యంలో రక్తనాళాల వ్యాధులపై అవగాహన కలిగించేందుకు ఆదివారం వాక్‌థాన్ నిర్వహించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద నిర్వహించిన ఈ వాక్‌థాన్‌ను ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈఓ లక్ష్మీశా జెండా ఊపి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోండా ఉమా పాల్గొన్నారు.

వ్యాయామం తప్పనిసరి..

ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ మాకినేని కిరణ్, డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ రత్నశ్రీలు మాట్లాడుతూ రక్తనాళాల జబ్బులు, వాటి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు చికిత్సల గురించి ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈ వాక్‌థాన్ నిర్వహిస్తున్నామన్నారు. మందులు వేసుకుంటే వ్యాధి తగ్గిపోతుందని అందరూ భావిస్తారని, వ్యాధి తగ్గాలంటే మందులతో పాటు మన వైపు కృషి చేయాలన్నారు. వ్యాయామం, ఆహార నియమాలు వంటివి పాటిస్తే కాళ్లు నల్లబడటం, గుండె జబ్బులు, పక్షవాతం వచ్చే రిస్క్ తగ్గుతుందన్నారు. నూనె, వేపుడు, కొవ్వు పదార్థాలు తగ్గిస్తేనే వ్యాధి రాకుండా నియంత్రించవచ్చునన్నారు. ఉబ్బిన సిరలు రాకుండా ఉండాలంటే వ్యాయామం చేయడం, ఒకే చోట నిలబడకుండా పని చేయడం, స్థూలకాయం తగ్గించుకోవడం చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, వాకర్స్ పాల్గొన్నారు.



రక్తనాళాల సమస్యలను వివరిస్తున్న వాస్క్యులర్ సర్జన్స్ మాకినేని కిరణ్, శివకృష్ణ తదితరులు

నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదులు - పరిష్కార వేదిక కార్యక్రమం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని 64 డివిజన్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదులు – పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర వాసులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవాలని వీఎంసీ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో, చిట్టినగర్ సర్కిల్ – 1 కార్యాలయం, సత్యనారాయణపురంలోని సర్కిల్ – 2, పటమటలోని సర్కిల్ – 3 కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఆయా ప్రాంతాల స్థానికులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆదివారం పలువురు నృత్యకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. విజయవాడకు చెందిన భాగవతుల వెంకటరామశర్మ శిష్య బృందం పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నృత్యకారులు చక్కటి హావభావాలతో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇవ్వగా, భక్తులు ఎంతో ఆసక్తితో వీక్షించారు.

అనంతరం నృత్య బృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.



బీపీ, షుగర్‌పై అప్రమత్తంగా ఉండాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీపీ, షుగర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుండె, మెదడు, రక్తనాళాలు, కిడ్నీలు, కళ్లపై ఈ రెండు వ్యాధులు తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని ఫ్యామిలీ హాస్పిటల్ డాక్టర్ సైరాభాను పేర్కొన్నారు. జక్కంపూడిలోని విజేత పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఫ్యామిలీ హాస్పిటల్‌తో పాటు అయాన్ హాస్పటల్ డాక్టర్ బషీర్‌లు తమ వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా పలువురు కాలనీ వాసులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వారికి అవసరమైన మందులను అందజేశారు. చాలా మందిలో బీపీ, షుగర్‌లు ఉన్నట్లు కూడా తెలియదని, పరిస్థితులు విషమించకుండా తరుచూ వైద్య పరీక్షలు చేయించుకుని జాగ్రత్త పడాలన్నారు. కంటి సమస్యలపై డాక్టర్ బషీర్ ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమాన్ని హాస్పిటల్ గౌరవ అధ్యక్షుడు వావిలాల రజనీకాంత్ శర్మ పర్యవేక్షించారు. స్కూల్ కరస్పాండెంట్ వై.ఆంజనేయరెడ్డి, ఇన్‌చార్జి హెచ్ఎం వాణి, టీచర్లు తమ సేవలను అందించారు.



వైద్యశిబిరంలో రక్తపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

వైభవంగా మహాదుర్గ అమ్మవారి విగ్రహావిష్కరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీవిజయ దుర్గాదేవి ఆలయం 7వ వార్షికోత్సవం మహోత్సవాలు జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. ఆషాఢ మాస అమావాస్య ఆదివారంనాడు పుట్టింటివారి ఆధ్వర్యంలో ఉదయం చండీ హోమంతో ఉత్సవాలు ప్రారంభంకాగా 11.30 గంటలకు 18 అడుగుల మహా దుర్గ అమ్మవారి విగ్రహావిష్కరణ జరిగింది. మధ్యాహ్నం 1.45 గంటలకు అమ్మవారికి మహా కుంభం, అనంతరం తల్లి, శక్తుల విగ్రహ ప్రతిష్ఠ, అన్న సంతర్పణ కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి గణాచారిణులతో అమ్మవారి పవళింపు సేవ జరిగింది. గురువు కరుమూరి దాసు మాట్లాడుతూ.. ఉత్సవాల్లో భాగంగా సోమవారం మృత్యుంజయ హోమం, అనంతరం విఘ్నేశ్వర, శివలింగం, నాగపడగల ప్రతిష్ఠలు జరుగుతాయని తెలిపారు. అన్న సంతర్పణ, మహా హారతులు ఉంటాయని పేర్కొన్నారు. మంగళవారం స్వామి, అమ్మవార్ల గ్రామ ఊరేగింపు నిర్వహిస్తామని చెప్పారు. విగ్రహ దాత కోగంటి సత్యనారాయణ, గణాచారి కీర్తి భవానీ, సగురుపల్లి లక్ష్మి, నమ్మి దుర్గాసాయి, గణాచారి రాజశ్రీ, జానిరాజు, ప్రభుదాసు, కాళిదాసు, పూజారి గోవింద్ పాల్గొన్నారు.



మహా దుర్గ విగ్రహావిష్కరణలో కోగంటి సత్యం, ఆలయ నిర్వాహకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని సమస్యలను పరిష్కరించేందుకు పూర్వ విద్యార్థులంతా కలిసి ముందుకు రావడం అభినందనీయమని విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి అన్నారు. స్థానిక రమేష్ ఆస్పత్రి రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కళాశాల ఆవరణలో ఆదివారం జరిగింది. విజయ సారథి మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులందరూ ప్రతి ఏటా స్నేహితుల దినోత్సవం రోజున ఈ విధంగా కలుసుకుని సంతోషంగా గడపడమే కాకుండా వారంతా చదువుకున్న కళాశాలలోని సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నారని చెప్పారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎంవీ.బాబు మాట్లాడుతూ.. కళాశాల తరగతి గదులు, పరిపాలనా భవనం నిర్మాణం చేసి 60 ఏళ్లు పూర్తవుతుందని, వీటిని మరమ్మతులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంలోని అధికారులను కలిసి తమ సంఘం తరఫున విజ్ఞప్తి చేస్తామన్నారు. సభ అనంతరం పూర్వ విద్యార్థులందరూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. దీంతో కళాశాలలో సందడి వాతావరణం నెలకొంది. పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి గోపీచంద్, వైస్ ప్రెసిడెంట్ కేవీ రమేష్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ డి.వెంకటేశ్వర్లు, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ భానుమూర్తి పాల్గొన్నారు.

ఉద్యమాల పాట 'వడ్లమూడి'

కృష్ణలంక(విజయవాడతూర్పు): కళారంగానికి ప్రాథమిక ఆయుధం పాటని, అటువంటి పాటని ఒకనాటి ఉద్యమ అవసరాలకు ఆయుధంగా మలచిన ప్రజాకవి వడ్లమూడి అని ప్రముఖ కవి కె.దేవేంద్ర పేర్కొన్నారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ప్రజాకవి, రచయిత, రైతు నేత, అమరజీవి వడ్లమూడి నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవంలో భాగంగా ప్రజానాట్యమండలి, వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఆట – పాట – మాట కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా దేవేంద్ర మాట్లాడుతూ వడ్లమూడి వేలు పట్టుకుని తన పాట ప్రయాణం మొదలైందని సగర్వంగా ప్రకటించారు. కవిగా వడ్లమూడి స్పృశించని అంశం లేదని, గురజాడ దేశభక్తి గీతానికి సరి సమానమైన సందేశం గీతాన్ని వడ్లమూడి రచించారన్నారు. ఎమర్జెన్సీ కాలంలో నాటి దుశ్చర్యలను నిరసిస్తూ మారాజులొచ్చారు(రంగి) నృత్యరూపకాన్ని రచించి రాష్ట్రమంతా ప్రదర్శనలిచ్చారని గుర్తుకు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన ప్రజా కళాకారులు వడ్లమూడి రచించిన గీతాలను ఆలపించి ప్రదర్శించిన పలు నృత్య రూపకాలను విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత వడ్లమూడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వడ్లమూడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖ కవి దేవేంద్ర తదితరులు

ముగిసిన సారె సంబరం

ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసోత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. నెల రోజులుగా పెద్ద సంఖ్యలో భక్త బృందాలు అమ్మవారికి సారెను సమర్పించి, తమ భక్తిని చాటుకున్నాయి. ఉత్సవాల్లో చివరి రోజైన ఆదివారం ఆలయ ఈవో కె.ఎస్.రామరావు దంపతులు అమ్మవారికి సారెను సమర్పించారు. దీంతో ఆలయ ప్రాంగణంలో కోలాహలం నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











• **మధురానగర్(విజయవాడసెంట్రల్):** ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో నిత్యాన్నదానానికి ఆదివారం ప్రముఖ వైద్యులు డాక్టర్ ముప్పా ఇంద్రకీల గిరీష్ రూ.50 వేలు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతంరెడ్డి మాట్లాడుతూ తాము మందిరంలో తలపెట్టిన ప్రతి కార్యక్రమానికి భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం ఎనలేనిదన్నారు.